కథానిక: # తెల్లవారింది

శ్రీ బి. వి. కరుణాకర్

ఆరోజ్గుకు పది నెలలు పాతబడిన చలపతి సైకిలు తొక్కుతున్నాడు. తెల్లవారడానికి ఇంకో గంట వెలితిగా ఉంది. చల్లటి గాలి వీస్తుంది. సైకిలు సీటు వెనకాల ఆరోజు పేపర్లు చలపతి జీవితంలా బరువుగా ఊగుతున్నాయి. ఏజెంటు ఆఫీసు అగి మలుపు తిరిగింది. సైకిలు ముందుకు పోతుంది. చలపతి మనసులో ఆలోచనలు తెరలు తెరలుగా ముసురుకుంటున్నాయి. ఈ పేపర్లు ఇవ్వవలసిన వాళ్ళకు ఇచ్చే సరికి ఎనిమిదౌతుంది. తిరిగి ఏజంటుకు కనిపించాలి. ఆలస్యం కాకపోయినా ఆలస్యం ఎందుకయింది అంటాడాయన. ఆయనకు ఏదో చెప్పి నచ్చచెప్పాలి. ఆయన ముఖం ఎప్పుడూ క్వశ్చన్ టేగ్ లా కనిపిస్తుంది.

సైకిలు ఆగింది. దిగి బెల్ కొట్టాడు చలపతి. కుక్క అరుస్తోంది.

'టామీ ఊరుకో' అదిలింపు.

'గుడ్ మార్నింగ్ సార్' అన్నాడు చలపతి.

కుక్క అరుస్తూనే ఉంది. జవాబు లేదు. పేపరు ఇచ్చి, సైకిలు వెనక్కి తిప్పి ఎక్కాడు.

రొటీన్ జీవితం. నిన్నటికీ ఇవాళకూ తేడా ఉండదు. రేపూ ఇంతే. మలుపు తిరిగాడు. ఎదురుగా రెండంతస్తుల మేడ కనిపిస్తుంది. మేడ చుట్టూ ఫెన్సింగు. పూల మొక్కలు. మొక్కలకు నీళ్ళు పోస్తూ పన్నెండేళ్ళ పాప రోజూ కనిపిస్తుంది. ఆ పాపను చూస్తే చలపతికి తన చెల్లెలు గుర్తుకు వస్తుంది. పేపరు అందుకోడానికి పాప పరుగెత్తుకుంటూ వస్తుంది. నవ్వితే బుగ్గలు సొట్టపడతాయి. అటువంటప్పుడు పాప అందం ద్విగుణీకృతం అయినట్లనిపిస్తుంది. ఆ పాప తండ్రి పేరు మోసిన వ్యాపారి. ఇతర్లను ముంచడంలో నేర్పరి. మోసంతో పేరుకుపోయిన పొరలు ఆయన జీవితం. అందుకే...

పాప మాటలు మరింత ముద్దుగా ఉంటాయి అనుకున్నాడు తను. పలకరిస్తే పాప పలకలేదు. నవ్వి ఊరుకుంది.

'నాతో మాట్లాడకూడదా' అన్నాడు తను.

పాప తల అడ్డంగా తిప్పింది.

'మరి...'

నిరుత్తరుడైపోయాడు తను. అసలు ముందు నమ్మలేకపోయాడు. పాప సైగలు చేస్తుంది. మాటలు రావు. మూగది.

పాపను చూసినప్పుడల్లా అదో రకమైన బాధతో తన మనసు మెలికలు తిరిగిపోతుంది.

పేపరు ఇచ్చి వెనక్కి తిరిగాడు. సైకిలు ముందుకు పోతుంది.

పోయిన సంవత్సరం. ఈ సరికి తనజీవితంమీద ఏ బాధ్యతా బరువు లేదు. నాన్న ఉన్నారు. ఇంట్లో అంతా సవ్యంగా గడచిపోతుంది.

రేపు సంక్రాంతి అనగా—

నాన్నగారు ఇంటికి వచ్చేటప్పటికి చీకటి పడింది. అమ్మ అందరకూ భోజనం వడ్డించింది. నాన్న ఉత్సాహంగా ఏదో చెబుతూ భోజనానికి కూర్చున్నారు. ఒక ముద్ద నోట్లో పెట్టుకున్నారు. తలుపు మీద ఎవరో తట్టిన చప్పుడైంది. అమ్మ తలుపు తీసింది. ఎదురుగా పోలీసులు.

నాన్న లేచి నుంచుని 'ఏమిటి?' అన్నారు ఆశ్చర్యపోతూ.

'ఇతనే మా క్యాషియర్' పోలీసుల వెనకాలనుండి సన్నని ఆఫీసరు గొంతు.

అంతే! నాన్న చేతులకు బేడీలు వేసి తీసుకు వెళుతుంటే అమ్మ మూర్ఛపోయింది. తమ్ముడూ చెల్లెలూ బిక్కముఖాలు వేసి ఏడుస్తుంటే ఓదార్చాడు తను. ఇచ్చిన గా సంక్రాంతి నాడు అభిమానం చంపుకోలేని నాన్న పోలీస్ స్టేషన్ లో ఉన్న బావి లో పడి చనిపోయారు.

సైకిలు ఆగింది.

వరండాలో కూర్చుని సిగరెట్ పీలుస్తున్నాడు రంగాచారి. స్టాండ్ వేసి పేపరు తీసి రంగాచారికిచ్చాడు చలపతి.

'మాట' పిల్చాడు రంగాచారి.

వెళ్ళిపోతున్నవాడల్లా ఆగి రంగాచారి ముఖంలోకి పరీక్షగా చూశాడు చలపతి.

'పేపరు ఆలస్యం అయిందేం?'

చలపతి మాట్లాడలేదు.

'పేపరు ఆలస్యం అయిందెందుకని అడుగుతున్నాను'

'ఆలస్యం అయింది సార్'

'అదే ఎందుకు అని అడుగుతున్నాను.'

'ప్రెస్ నుంచి రావడమే లేటైంది.'

'అవుతుంది, అవుతుంది. మాటలు చెప్పకు. రేపట్నుంచి కాస్త త్వరగా తెస్తు ...

'సరే'

చలపతి సైకిలు ఎక్కబోయాడు.

'మాటు' అన్నాడు రంగాచారి.

ఆగి ఆయన వంక చూశాడు చలపతి.

'తమ్ముడూ, చెల్లాయి బాగా చదువుకుంటున్నారా. అమ్మగారి ఆరోగ్యం బాగుందా. చూడు నీకెటువంటి సహాయం కావాలన్నా నన్ను అడగడానికి సందేహించకు. తోసింగా' అన్నాడు రంగాచారి.

రంగాచారి అలా అంటాడే కాని పిల్లికి బిచ్చం పెట్టడు. చలపతి తలూపి చిన్నగా నవ్వి సైకిలు ఎక్కాడు.

సైకిలు తారు రోడ్డుమీద జారిపోతుంది. సైకిలు వెనకాల బరువు క్రమంగా తగ్గిపోయింది. చెట్టి చీకట్లోంచి వెలుతురు చిక్కగా కురవసాగింది. జనసందడి ఇంకా ప్రారంభం కాలేదు.

రేపు ఉదయం రేపే జీతం తన చేతిలోకి వస్తుంది. సైకిలు అద్దె పోగా మిగిలిందాంట్లో అమ్మకు ఓ చీర తీసుకోవాలి. చెల్లాయికు పుస్తకాలు కొనాలి. తమ్ముడికి స్కూలు జీతం కట్టాలి. ఈ నెల గడవాలి. చలపతి ఆలోచనలతోపాటు సైకిలు మలుపు తిరిగింది.

అంతే!

'ఆ కుర్రాడేమో సైకిలుమీద వస్తూ ఇలా మలుపు తిరిగాడు లారీ అటువైపు నుండి వస్తుంది. చూసుకోలేదు గామోలు... ఎవరో పాపం...' అంటున్నారు.

చలపతి ముఖం చెక్కుచెదరలేదు. కళ్ళు తెరుచుకునే ఉన్నాయి. ఆ కళ్ళల్లో రేపు వెలుగులోకి పరీక్షగా చూస్తుంది. పెదాలు బాధతో మెలికలు తిరిగి భరించలేక నవ్వి ఆగిపోయాయి.



# నగ్నగీతి

యం. కె. సుగమ్ బాబు

నాకు తెలుసు—
నన్నెవరూ పంచుకోలేరు!
నా దుఃఖాన్ని పంచుకోలేని వారెవరూ...
నా సంతోషాన్ని పంచుకోలేరు!!
నాలో పూచిన వసంతాన్ని
నాలో ధ్వనించే కోకిలగానాన్ని,
నాలో స్పందించే మధురానుభూతిని,
ఎవరు పంచుకోగలరు?
నను మండించిన గ్రీష్మాన్ని,
నను వణికించిన హేమంతాన్ని
నను ఒలిచేసిన శిశిరాన్ని
ఎందరు పంచుకొన్నారో?
నాకు తెలుసు, నన్నెవ్వరూ పంచుకోలేరు!
అందుకే, నేను—
నన్ను చూచి యెవరూ యీర్ష్య పడనక్కర్లేదు!
నే ననుభవిస్తున్న వెన్నెలరాత్రి కరిగిపోతుందనీ,
రేపు చీకటి ముసుకొస్తుందనీ-
ఎవరూ నన్ను హెచ్చరించనక్కర్లేదు!
నేను తెలిసికొన్నాను—
అమృతమూ హాలాహలమూ ఒకే జలధిలో జనించాయని!
మంచీ చెడూ, రెండూ రెండు విభిన్న ప్రవృత్తులు కల్గివుంటాయని!
సుఖమూ దుఃఖమూ, జీవితంలో జీవి అధిగమించాల్సిన మైలురాళ్లనీ
నేను తెలిసికొన్నాను —
వెలుగు ప్రక్క చీకటి,
చీకటి ప్రక్కనే వెలుగు జీవిస్తుందని!
ఆకురాల్చిన కొమ్మ చిగిర్చి తీరుతుందని!